తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
24 అక్టోబర్ 2026
పేజీలు : 09
Follow :





జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించి, పరిసర ప్రాంతాల ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ నెల 25న రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, 27 నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రజలంతా పార్టీలకు అతీతంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలించాల్సిందే..

## 27 నుంచి పాదయాత్ర.. 25న అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం

## సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆపేది లేదు : ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 (జనంసాక్షి)

జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తరలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాల సన్నాహక సమావేశం శుక్రవారం దమ్మాయిగూడలోని సాయిభవాని ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న కాలుష్యంతో కీసర, ఘట్‌కేసర్, దమ్మాయిగూడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. లీచేట్ నీటితో చెరువుల్లో చేపలు చనిపోతున్నాయని, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భస్రావాలు, క్యాన్సర్, శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని స్థానికులు చెబుతుంటే బాధ కలుగుతోందన్నారు. పేదలు నివసించే ప్రాంతం కావడంతో సమస్యను నిర్లక్ష్యం చేయడం తగదని పేర్కొన్నారు.

### ప్రభుత్వం స్పందించాలి

డంపింగ్ యార్డు సమస్యను పార్లమెంటులో ప్రస్తావించానని, కేంద్ర మంత్రిని కలిసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక తీసుకురావాలని సూచించారని ఈటల తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి సమస్య తీవ్రతను వివరించినా ఫలితం లేకపోయిందని విమర్శించారు. చెత్త



నిర్వహణకు శాశ్వత పరిష్కారం చూపాలని, దుర్వాసన, లీచేట్ సమస్యలను నివారించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని కోరారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ ప్రతిష్ఠకు భంగం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.

### ఐక్యంగా ఉద్యమిద్దాం

డంపింగ్ యార్డు సమస్యపై బీజేపీ ప్రజాప్రతినిధులంతా కలిసి పోరాడతారని ఈటల తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా



ఉద్యమానికి మద్దతు ప్రకటించారని చెప్పారు. అవసరమైతే జవహర్‌నగర్‌లో సకల జనుల సమ్మె చేపడతామని హెచ్చరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వాల ప్రాధాన్యంగా ఉండాలన్నారు.

### జవహర్‌నగర్ సమస్య రాహుల్‌గాంధీకి కనిపించడం లేదా? : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం కోసం ఈటల రాజేందర్ చేపట్టనున్న పాదయాత్రలో తాము పాల్గొంటామని బిజెపి శాసనసభ పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, ఎస్.మల్లారెడ్డి, ఎస్‌టి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ కాంటెస్టెడ్ ఎంఎల్‌ఏ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే, ఎంబిసి మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, మాజీ రూరల్ మేడ్చల్ అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు సామా రంగారెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ చంద్రారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ కే శ్రీనివాస్, మాణిక్ రెడ్డి, జిల్లాల్ తిరుమల్ రెడ్డి, తిరపతి యాదవ్, మన్సూరా బాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి, ఎల్లంపేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శామీర్పేట్ మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ బాబు, జవహర్ నగర్ మాజీ ఎంపిటీసి రషీదా బేగం, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ ఆనంద్, అధిక సంఖ్యలో రాష్ట్ర, జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
24 అక్టోబర్ 2026
పేజీలు : 08

# రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

**జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**




**రంగారెడ్డి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని గుర్తు చేశారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల వివరాలను పరిశీలించి, ప్రమాద నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, మున్సిపల్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తే, నిబంధనల మేరకు అనుమతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రధాన కారణాలని ఆమె తెలిపారు. రక్షణాత్మక డ్రైవింగ్ (డిఫెన్సివ్ డ్రైవింగ్) అలవర్చుకోవాలని, వాహనం నడిపేటప్పుడు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాల విద్యార్థులు, కళాశాల యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, వాహనదారులు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖ, జాతీయ రహదారుల శాఖ, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలి

**మాజీ ఎమ్మెల్యే చింతల**



**ఖైరతాబాద్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** నగరంలో తాగునీటి సరఫరాను మెరుగుపరచి, ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బీ) మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసి ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యం లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడు తూ హైదరాబాద్ నగరంలోని అనేక ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తగినంతగా లేకపోవడం, నీటి సరఫరాలో జాప్యం, నిర్ణీత సమయపాలన పాటిం చకపోవడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం తో గృహావసరాలకు నీటిని సమకూర్చుకోవడంలో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నా రు.నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని వారు అధికారులను కోరారు. నీటి సరఫరాలో ఉన్న లోపాలను గుర్తించి, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ప్రాంతానికి నిర్ణీత సమయాల్లో తగినంత నీరు అందేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎల్‌నినో ప్రభావాల కారణంగా భవిష్యత్తులో తలెత్తే వాతావరణ, నీటి లభ్యత సంబంధిత సమస్యలను దృష్టిలో ఉంచు కొని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా, సరఫరాలో అంతరాయాలు లేకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజలకు సకాలంలో, సక్రమంగా తాగునీరు అందించడం కోసం వాటర్ బోర్డు అధికారులు సమన్వయంతో పనిచేయాలని వారు కోరారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జి. ఆనంద్ గౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఎం. రాఘవ రెడ్డి, వివిధ మోర్చాలకు చెందిన నాయకులు, బీజేపీ కిసాన్ మోర్చా మీడియా కన్వీనర్ అడ్వకేట్ టి. వైద్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు శుభవార్త .. ఉచితంగా నైపుణ్య శిక్షణ



**తాండూరు అక్టోబర్ 23 (జనంసాక్షి):** నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జినుగుర్తి ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ముదిరాజ్ సంఘం నాయకులు లొంక నర్సింలు తెలిపారు. టీవీ, ఫ్రిజ్, ఏసీ, మొబైల్ రిపేరింగ్‌తో పాటు వివిధ నైపుణ్య ఆధారిత కోర్సుల్లో శిక్షణ అందించనున్నామని వెల్లడించారు. యువత స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన ఆర్థిక ప్రోత్సాహం కల్పించే దిశగా, నాబార్డ్ లేదా ప్రభుత్వ పథకాల ద్వారా అర్హతలను బట్టి ఆర్థిక సహాయం, సబ్సిడీ పొందేందుకు అవకాశం కల్పిస్తాము. ఆసక్తి గలవారు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్: 9010678398. ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## హబ్సిగూడ ఎక్స్‌రోడ్స్‌లో ఆక్రమణల తొలగింపుపై కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ

**ప్రజా స్థలాల పరిరక్షణే లక్ష్యం..**
**సురక్షిత రాకపోకలకు ప్రాధాన్యం**

**ఉప్పల్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** ప్రజలకు ఇబ్బందులు లేని రహదారులు, పాదచారులకు అడ్డంకులు లేని మార్గాలు కల్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా హబ్సిగూడ ఎక్స్‌రోడ్స్ వద్ద మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. రోడ్లపై ఆక్రమణల తొలగింపు, ప్రజా స్థలాల పరిరక్షణ, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడటంపై ప్రధానంగా దృష్టి సారించారు. ప్రజలు నిత్యం ప్రయాణించే రహదారులు సాఫీగా ఉండటంతో పాటు, పాదచారులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రాధాన్యంగా తీసుకున్నారు. ప్రజా రహదారులు ప్రజలందరి వినియోగం కోసమేనని, వాటిపై ఆక్రమణల వల్ల సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రహదారులు పరిశుభ్రంగా ఉండటంతో పాటు, ప్రజా స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా అధికారులు పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న రాకపోకల నేపథ్యంలో రహదారుల నిర్వహణ, పాదచారుల సౌకర్యాలు, ప్రజా స్థలాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, రోడ్లపై ఆక్రమణల కారణంగా ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా అధికారులు దృష్టి సారించారు.

ప్రజలకు సౌకర్యవంతమైన రహదారులు, స్వేచ్ఛాయుత రాకపోకలు, సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమనే సందేశాన్ని ఈ తనిఖీ ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది.



## బండరావిరాలలో బెల్ట్ షాపుల మూసివేతకు చర్యలు తీసుకోవాలి

**అక్రమ మద్యం విక్రయాలపై అబ్దుల్లాపూర్‌మెట్ సీఐకి ఫిర్యాదు చేసిన సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్**



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** గ్రామ ంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్ పోలీసులను కోరారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ సీహెచ్. రాజుకు గ్రామ పాలకవర్గ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామసభలో చేసిన తీర్మాన ప్రతులతో పాటు సంబంధిత నోటీసులను అందజేశారు.గ్రామంలో తెల్లవారుజామున 5 గంటల నుంచే బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గ్రామసభలో మహిళలు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మద్యం విక్రయాల వల్ల అనేక కుటుంబాలు ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బెల్ట్ షాపుల నిర్వహణపై గ్రామసభలో సమగ్రంగా చర్చించి, వాటిని మూసివేయాలని తీర్మానం చేశారు.గ్రామంలో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రజలు మద్యపానం వల్ల ఆరోగ్యపరంగా, ఆర్థికంగా నష్టపోకుండా చూడటం, యువతను మద్యపాన దుష్ప్రభావాల నుంచి రక్షించడమే లక్ష్యంగా బెల్ట్ షాపుల మూసివేతకు చర్యలు కోరినట్లు సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దూస శంకర్, వార్డు సభ్యులు ఏర్పుల హరికృష్ణ, గుండ్ల భవాని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం



**ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి**

**ఖైరతాబాద్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** రానున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి రాజకీయ సమాధానం చెబుతామని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) అన్నారు. పట్టభద్రుల ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే కీలక ఎన్నిక లని పేర్కొన్నారు.పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఫిల్మ్‌నగర్ డివిజన్ పరి ధిలోని ఎంఆర్‌సీ కాలనీ, బీజేఆర్ నగర్‌లో పట్టభ ద్రులకు దరఖాస్తు ఫారాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేయడంలో విఫలమైందని విమ ర్శించారు. ప్రభుత్వ పాలనపై పట్టభద్రులు తమ తీర్పు ఇచ్చే సమయం ఆసన్నమైందన్నారు.విద్యా వంతులు, నిరుద్యోగ యువత, మేధావులు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవా లని పిలుపునిచ్చారు. పట్టభద్రులంతా ఓటరు నమోదును పూర్తి చేసుకుని ప్రజా సమస్యలపై స్పందించే అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకీ ముదిరాజ్, సైదులు, జ్యోతి స్వరూప్, తేజ, నవీన్, తరుణ్, సంతు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో విజయం

**ఆర్ఎం శ్రీలతను కలిసిన ఇ.పట్నం డిపో కార్మికులు**

**రంగారెడ్డి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** ఆర్టీసీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తు ఘన విజయం సాధించిన సందర్భంగా, ఇబ్రహీంపట్నం ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రీజినల్ మేనేజర్ శ్రీలతను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిపో కార్మికులు, నాయకులు ఆర్ఎంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిపో పరిధిలోని పలు సమస్యలను ఆర్ఎం దృష్టికి తెచ్చారు. వాటి పరిష్కారానికి ఆమె సానుకూలంగా స్పందించారు. కార్మికుల సంక్షేమానికి, డిపో అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆర్ఎం హామీ ఇచ్చారు. యూనియన్ తరఫున కూడా యాజమాన్యానికి పూర్తి సహకారం అందిస్తామని కార్మికులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి హామీనిచ్చిన ఆర్ఎం శ్రీలతకు డిపో కమిటీ తరఫున కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డిపో కమిటీ కార్యదర్శి చెరుకూరి పరమేష్, అధ్యక్షులు జిల్లా జంగయ్య, సహాయ కార్యదర్శి ఈట శేఖర్, జోనల్ అడ్వైజర్ బి. అశోక్, సీనియర్ నాయకులు కృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీలు సి.హెచ్. రమేష్, ఎం. కృష్ణ, కోశాధికారి ఎర్ర బాలకిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుసరి వెంకటేష్, జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ సి.హెచ్. యాదగిరితో పాటు పెద్ద సంఖ్యలో డిపో కమిటీ సభ్యులు మరియు కార్మికులు పాల్గొన్నారు.



**ఇంటి నుంచే సుస్థిర జీవనానికి శ్రీకారం..**

# పచ్చని మల్కాజిగిరికి స్ఫూర్తి!

- **85 ఏళ్ల మాజీ డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు మందవ ఇంట్లో పర్యావరణహిత జీవన విధానాలు**

**ఉప్పల్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు చేపట్టే చర్యలతో పాటు ప్రతి పౌరుడు తన ఇంటి నుంచే బాధ్యతాయుతమైన అలవాట్లను ప్రారంభిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని 85 ఏళ్ల మాజీ డీఆర్‌డీఓ శాస్త్రవేత్త శ్రీ వెంకటేశ్వర్లు మందవ నిరూపిస్తున్నారు. ఇంట్లో ఉత్పత్తయ్యే వ్యర్థాలను సమర్థంగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ఇంటి తోటలను పెంచడం వంటి పర్యావరణహిత పద్ధతులతో ఆయన సుస్థిర జీవనానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడలో నివసిస్తున్న వెంకటేశ్వర్లు మందవ గారి పర్యావరణ అనుకూల గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంట్లో అమలు చేస్తున్న పలు సుస్థిర జీవన పద్ధతులను పరిశీలించి, వాటి ద్వారా పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు. సాధారణ గృహాల్లోనూ ఆచరించగలిగే ఈ పద్ధతులు ప్రజలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

### వంటగది వ్యర్థాలతో సేంద్రియ ఎరువు

ఇంట్లో రోజూ ఉత్పత్తయ్యే వంటగది వ్యర్థాలను చెత్తగా పారవేయకుండా కంపోస్ట్‌గా మార్చి, దానిని మొక్కలకు ఎరువుగా వినియోగిస్తున్నారు. ఈ విధానం ద్వారా తడి వ్యర్థాల పరిమాణాన్ని తగ్గించడంతో పాటు, ఇంటి ఆవరణలో తాజా కూరగాయలు, ఇతర మొక్కలను పెంచేందుకు అవకాశం ఏర్పడుతోంది. వ్యర్థాలను వనరులుగా మార్చుకోవచ్చనే విషయాన్ని ఈ పద్ధతి చాటిచెబుతోంది.

### పొడి వ్యర్థాలకూ సద్వినియోగం

వ్యర్థ కాగితాలు, చిన్నపాటి చెక్క ముక్కలను



నీటిని వేడి చేయడానికి ఇంధనంగా వినియోగించడం ద్వారా కొన్ని పొడి వ్యర్థాలకు కూడా ఉపయోగకరమైన మార్గాన్ని చూపిస్తున్నారు. ఈ ప్రక్రియలో వెలువడే బూడిదను మొక్కలకు అవసరమైన విధంగా తిరిగి వినియోగిస్తున్నారు. అయితే బూడిదలోని పదార్థాలు, నేల స్వభావాన్ని బట్టి దాని వినియోగాన్ని నిర్ణయించడం అవసరం. వర్షపు నీటిని వృథాగా ప్రవహించనివ్వకుండా భూమిలోకి ఇంకేలా మళ్లించడం ద్వారా భూగర్భ జలాల పునరుద్ధరణకు తోడ్పడుతున్నారు. వర్షపు నీటి సంరక్షణ ఒక్క ఇంటికే కాకుండా పరిసర ప్రాంతాల నీటి లభ్యతకు కూడా పరోక్షంగా ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. పెరుగుతున్న నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంట్లో వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ విధానం గుర్తుచేస్తోంది.

# మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసిన మండల గౌరవ అధ్యక్షులు భరత్ రెడ్డి



**నవాబుపేట్ అక్టోబర్ 23 ( జనం సాక్షి):** నవాబుపేట్ మండల పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు అంతనోల్ల దయాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు భరత్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం దసరా పండుగను పురస్కరించుకొని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యేమాజీ మంత్రి, పి. సబితా ఇంద్రారెడ్డిని నవాబుపేట మండలానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో జరిగిన ఈ కలయికలో నాయకులు శాలువాతో సత్కరించి, పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు.

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నవాబుపేట మండల ప్రజలకు, కార్యకర్తలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అంత మొల్ల దయాకర్ రెడ్డి పార్టీ అధ్యక్షులు భరత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తం చారి,పార్టీ సీనియర్ నాయకులు మాణిక్యం రెడ్డి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్, కావాలి రాజు,ప్రచార కార్యదర్శి వెంకట్ రెడ్డి, రైతు సంఘ అధ్యక్షులు మల్లేశం,నవాబుపేట మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాండూరులో 'ఆశల' రాజకీయం

**తాండూరు, అక్టోబర్ 23 (జనంసాక్షి):** రాజకీయం ఎప్పుడూ ఆసక్తికరమే. ఎన్నికలు అయిపోయాయి, ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు దాటింది. ఇక మొదలైంది అసలు సినిమా - పదవుల వేట.అధికారంలోకి వచ్చిన పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఆశ ఉంటుంది. మండల పార్టీ, మార్కెట్ కమిటీ, గ్రంథాలయ చైర్మన్, దేవాలయ కమిటీలు... ఇలా ఏదో ఒక పదవి వస్తుందని. ఆ ఆశలతోనే చాలా మంది నాయకులు పార్టీ మారారు, జెండాలు మోశారు, జై కొట్టారు.

### ఫలితం - కార్యకర్తల్లో నిరాశ.....

పార్టీ కార్యాలయంలో కనిపించడం తగ్గింది. ఎక్కడైనా కార్యక్రమం ఉంటే పదవులు ఉన్న నాయకులే ముందు వరుసలో ఉంటున్నారు. పదవి లేని నాయకులు వెనుకబడిపోతున్నారు. దీంతో "పదవి ఉంటేనే ఉత్సాహం, లేకుంటే నీరసం" అనే కొత్త సంస్కృతి మొదలైందని సీనియర్ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు. ఇప్పుడు నాయకుల పరిస్థితి గాలిలో దీపంలా ఉందని అనుచరులే అంటున్నారు. అటు పాత పార్టీలోనూ ఇమడలేక, ఇటు కొత్త పార్టీలోనూ పదవి రాక నలిగిపోతున్నారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, పెద్ద నాయకులు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారట.రాజకీయాల్లో ఇది సహజం. ఎత్తుకు ఎదగాలని పోయి, ఆశల గోతిలో పడినట్టు అయ్యిందని ప్రత్యర్థులు సెటైర్లు వేస్తున్నారు.తాండూరు నియోజక వర్గంలో నామినేటెడ్ పదవులు దాదాపు 40 వరకు ఉన్నాయి. కానీ ఆశావహులు మాత్రం 200 మందికి పైనే ఉన్నారు. బీఎంఆర్ వర్గం, పట్నం మహేందర్ రెడ్డి వర్గం - ఈ రెండు వర్గాల మధ్య పదవుల లెక్క తేలడం లేదు. దీంతో నాయకులకు పదవులు అందని ద్రాక్షలా మారుతున్నాయి.రాబోయే , స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఈ పదవుల జాతర పూర్తవుతుందా? లేక ఆశలు అడియాశలవుతాయా? అనేది వేచి చూడాలి.

# ఉప్పల్ భగాయత్ ఫేజ్-2కు రూ.5.86 కోట్ల నిధులు!

### దెబ్బతిన్న రహదారులకు మహర్దశ.. రెండు ప్రధాన రోడ్లకు రీకార్పెటింగ్

**ఉప్పల్, (జనం సాక్షి):** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్ అభివృద్ధికి మరో భారీ ముందడుగు పడింది. ఫేజ్-2లో దెబ్బతిన్న రహదారులకు పునర్వైభవం తీసుకొచ్చేలా రూ.5 కోట్ల 86 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి ఈ నిధుల మంజూరుకు కృషి చేశారు.

భగాయత్ హెచ్ఎండీఏ లేఅవుట్‌లో ఇప్పటికే వివిధ మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరైన విషయం తెలిసిందే. ఆ పనులు కొనసాగుతున్న తరుణంలోనే మరోసారి భారీగా నిధులు అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ముఖ్యంగా నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఎదుర్కొంటున్న రహదారుల సమస్యలకు పరిష్కారం లభించనుంది.

**రెండు ప్రధాన రహదారులకు నిధుల కేటాయింపు**

ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లో మొత్తం రెండు ప్రధాన రహదారుల పునరుద్ధరణ కోసం ఈ నిధులను కేటాయించారు.

మొదటి పని: రూ.3.88 కోట్లతో రహదారి పునరుద్ధరణ

ఇన్నర్ రింగ్ రోడ్డు నుంచి సుఖీ శ్రీ సుమేరు మీదుగా డీ మార్ట్ వాటర్ ట్యాంక్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ వరకు దెబ్బతిన్న బీటీ రోడ్డుకు రీకార్పెటింగ్ పనులు చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.3.88 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనులు పూర్తయితే ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనదారులకు మెరుగైన రహదారి సదుపాయం అందుబాటులోకి రానుంది.

రెండో పని: రూ.1.98 కోట్లతో మరో రహదారికి మెరుగులు

ఫేజ్-2లోని వాసవి క్రౌన్ ఈస్ట్, సుఖీ శ్రీ సుమేరు లేన్ల సమీపంలో దెబ్బతిన్న బీటీ రోడ్డుకు రీకార్పెటింగ్ చేసేందుకు రూ.1.98 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల ద్వారా రహదారి పరిస్థితి మెరుగుపడి, స్థానిక నివాసితులు, వాహనదారులకు రాకపోకల్లో ఇబ్బందులు తగ్గనున్నాయి.

**మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం**

ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో పెరుగుతున్న నివాసాలు, వాహనాల రాకపోకలకు అనుగుణంగా రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు నిధులు మంజూరు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రీకార్పెటింగ్ పనులు పూర్తయితే ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రాంత అభివృద్ధికి దోహదపడనున్నాయి.

మందుముల పరమేశ్వర్‌రెడ్డి సహకారంతో మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి నిధుల మంజూరుకు కృషి చేయడం ద్వారా భగాయత్ ఫేజ్-2లో రహదారుల అభివృద్ధికి మార్గం సుగమమైంది. మంజూరైన నిధులతో పనులు పూర్తయి ప్రజలకు మెరుగైన రహదారి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని స్థానికులు ఆశిస్తున్నారు.






## రేణుక ఎల్లమ్మ దేవాలయంలో అన్నదానానికి ప్రవీణ్ రావు ధాత చేయూత

**శామీర్ పేట, అక్టోబర్ 23 (జనం సాక్షి ):** మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద జరిగే అన్నదానానికి కరీంనగర్ కోరుట్ల కి చెందిన మాజీ ఎమ్మెల్యే కీ. శే. మిర్యాల కిషన్ రావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ప్రవీణ్ రావు వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి స్టీల్ సామాన్లు శుక్రవారం అంద జేశారు. ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే అన్నదానానికి పేపర్ ప్లేట్లు వాడడంతో అనారోగ్యానికి దారితీస్తుందని గుర్తించిన ప్రవీణ్ రావు 350 స్టీల్ ప్లేట్లు, 100 గ్లాసులు, 12 బేషన్లు, 6 బకెట్లు, 25 చిన్న ప్లేట్లు, 2 నీటి డబ్బాలు, స్పూన్లు దాతగా ముందుకు వచ్చి అందజేశారు. సామాన్లు అందజేసిన ప్రవీణ్ రావుకు గౌడ సంఘం ఆధ్వర్యం లో శాలువాతో కప్పి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మండల కాంగ్రెస్ నూతన కార్యవర్గం ఏర్పాటు

### వివిధ హోదాల్లో నాయకుల నియామకం

**చేవెళ్ల, అక్టోబర్ 22 (జనంసాక్షి):** చేవెళ్ల మండల కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గాన్ని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీ.గిరిధర్ రెడ్డి ప్రకటించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత విస్తరించడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో వివిధ హోదాల్లో నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కోశాధికారితో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా నలుగురు చేవెళ్ల మండల కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులుగా ఈర్లపల్లికి చెందిన ఎం.రాజశేఖర్, ఆలూరుకు చెందిన చంచలం రాజు, చన్వెల్లికి చెందిన బార్లపల్లి బాల్‌రెడ్డి, మీర్జాగూడకు చెందిన జనార్దన్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా అంతారానికి చెందిన వెంకటేష్ బాబు, రావులపల్లికి చెందిన బి. మహేష్, గుండాలకు చెందిన బిక్షపతికి బాధ్యతలు అప్పగించారు. కార్యదర్శులుగా నలుగురు అంతారానికి చెందిన సుధాకర్, న్యాలటకు చెందిన జి. యల్లయ్య, ఖానాపూర్‌కు చెందిన ఎస్. శ్రీనివాస్ రెడ్డి, మాడికట్టుకు చెందిన బాల్‌రెడ్డిని నియమించారు. సంయుక్త కార్యదర్శులుగా దేవరంపల్లికి చెందిన వై.మహిపాల్ రెడ్డి, తంగడపల్లికి చెందిన ఎం.డి.అంజత్, హస్తేపూర్‌కు చెందిన కిష్టాపురం హరీష్‌ను నియమించారు. మండల కాంగ్రెస్ కమిటీ కోశాధికారిగా కమ్మెటకు చెందిన జె. శ్రీపాల్ గౌడ్‌ను నియమించారు. నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ వర్గాలు ఆకాంక్షించాయి. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం నూతన కార్యవర్గం ప్రధాన బాధ్యతలుగా నిలవనున్నాయి.



## 60 కోట్లు విలువ చేసే పెరటి భూములు మాయం

- పెరటి భూములను రక్షించాలి
- అనుమతులు లేకుండానే లే అవుట్
- గత సర్పంచులు పెరటి భూమిని కబ్జా చేశారు
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్

**మహేశ్వరం, అక్టోబర్ 23 ( జనం సాక్షి):** మహేశ్వరం గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1,2లలో ఉన్న 4 ఎకరాల 6 గుంటల పెరటి భూమిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు,గతంలో సర్పంచులుగా పని చేసిన వారు కబ్జాలకు పాల్పడ్డారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ శుక్రవారం మహేశ్వరం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా కాకి ఈశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ...మహేశ్వరం గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 1,2లో పెరటి భూమిలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే లే అవుట్ చేసి పాట్లు క్రయ విక్రయాలు జరుపుతున్నారన్నారు.కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ,గ్రామ కంఠం భూములను బీఆర్ఎస్ పార్టీ నాయకులు కబ్జాలు చేసి కోట్ల రూపాయలు సంపాదించుకున్నారన్నారు.సర్వే నంబర్ 1,2లలో ఉన్న పెరటి భూములను రక్షించాలన్నారు.పెరటి భూములను కబ్జాలు చేసి ప్లాట్లు కొనుగోలు అమ్మకాలు జరుపుతున్న వారిపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి,రెవిన్యూ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పెరటి భూములను అక్రమాలకు గురి కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహేశ్వరం గ్రామంలో అక్రమాలు జరుగకుండా కృషి చేస్తానన్నారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగతమైన, రాజకీయ పరమైన కక్ష్యాలు లేవన్నారు.ప్రజల సంక్షేమం కోసం పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు లాజర్, జంగయ్య,మల్లేష్,పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ హాస్పటల్ ఏర్పాటు చేయాలి



## ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు

**మహేశ్వరం, అక్టోబర్23 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ తో కలిసి ఈఎస్ఐ డైరెక్టర్ ప్రియ రంజన్ సిన్హా కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలో వేలాది పరిశ్రమలు ఉన్నాయన్నారు. పరిశ్రమలలో లక్షలాది మంది కార్మికుల పనిచేస్తున్నారన్నారు. ఈఎస్ఐ హాస్పటల్ లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈఎస్ఐ హాస్పటల్ నిర్మాణం చేసే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మణ్,సహాయ కార్యదర్శి నాగరాజు,పలువురు ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సైనిక్‌పురిలో ఎంఆర్ ది ఐ వై నూతన స్టోర్‌ను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, అక్టోబర్23 ( జనం సాక్షి) :** సైనిక్‌పురిలోని శ్రీ ఆంజనేయ ఆర్కేడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ గృహోపకరణాలు, నిత్యావసర వస్తువుల స్టోర్ ఎంఆర్ ది ఐ వై ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్టోర్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. గృహోపకరణాలు, ఇంటి అలంకరణ వస్తువులు, ఇతర నిత్యావసర ఉత్పత్తులను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.దసైనిక్‌పురి పరిసర ప్రాంత ప్రజలకు ఈ స్టోర్ అందుబాటులోకి రావడం ద్వారా అవసరమైన వస్తువులను సులభంగా కొనుగోలు చేసేందుకు వీలుంటుందని తెలిపారు. స్టోర్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన అయ్యవారిగూడ కాంగ్రెస్ పార్టీ కమిటీ



యాచారం,అక్టోబర్ 23(జనం సాక్షి ): ఆపదలో ఉన్నవారికి చేయూతగా నిలుస్తూ అయ్యవారిగూడ కాంగ్రెస్ పార్టీ కమిటీ తన ఉదారతను చాటుకుంది. ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన కొప్పు పోచమ్మ కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు నక్క లక్ష్మయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్‌లు నక్క మహేందర్ యాదవ్, కొప్పు వెంకటస్వామి, జిల్లా యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, వార్డు సభ్యులు నక్క కలమ్మ నందు, పసులాది కరుణాకర్ రెడ్డి, పోలమోని జంగయ్య, మండలి చెన్నకేశవులు, బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నక్క మహేందర్, అలాగే మృతురాలి కుటుంబ సభ్యులు కొప్పు చంద్రశేఖర్, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.19 కోట్లతో రామంతాపూర్ పెద్ద చెరువుకు మహర్దశ!

## క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడుతోంది. రామంతాపూర్ పెద్ద చెరువుకు మహర్దశ పట్టనుంది. చెరువు రూపురేఖలను మార్చి, సుందరీకరించడంతో పాటు పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో హైడ్రా ఆధ్వర్యంలో చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు 18.23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు అభివృద్ధి కోసం రూ.19 కోట్ల నిధులు కేటాయించడంతో స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రామంతాపూర్ పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనుల పురోగతిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును సమీక్షించి, సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువు పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు.

**చెరువుల పరిరక్షణతో పర్యావరణానికి మేలు**

నగరంలో చెరువులు పర్యావరణ పరిరక్షణకు, ప్రకృతి సమతుల్యతకు ఎంతో కీలకమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెరువుల పరిరక్షణతో పాటు వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు సుందరీకరణ పనులు పూర్తయితే పరిసర ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులు మెరుగుపడటంతో పాటు స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి**

అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రధానమని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. పనుల నిర్వహణలో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టి, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చెరువు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. చెరువు పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటూనే సుందరీకరణ పనులు కొనసాగించాలని సూచించారు.

**ఉప్పల్ అభివృద్ధికి మరో ముందడుగు**

ఉప్పల్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు చెరువుల పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామంతాపూర్ పెద్ద చెరువు అభివృద్ధి పనులు పూర్తయితే స్థానిక ప్రాంతానికి కొత్త రూపు వస్తుందని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రూ.19 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు పూర్తయితే చెరువు పరిరక్షణకు కూడా దోహదపడనుంది.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ప్రవీణ్ రెడ్డి

**ఎల్బీనగర్ అక్టోబర్ 23 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన ప్రవీణ్ రెడ్డి పార్టీ అధిష్ఠానానికి, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐపీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు పారిజాత రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలతో సమాధానమిస్తానని ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తనపై నాయకత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవలో ముందుకు సాగుతానని తెలిపారు.



# ఉల్లిపాయ, వాము పంటల సాగు..

## మల్చింగ్‌కు సబ్సిడీ దరఖాస్తుల గడువు పొడిగింపు

## జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 23 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ పరిధిలో ఉల్లిపాయ, వాము పంటల సాగు మరియు మల్చింగ్‌కు సబ్సిడీ పొందేందుకు దరఖాస్తుల సమర్పణ గడువును నవంబర్ 10 వరకు పొడిగించినట్లు జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి సత్తార్ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షపాతంలో హెచ్చుతగ్గులు, నీటి లభ్యతలో మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగు చేయగల, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటల ఎంపికపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.రైతులు వ్యవసాయ పంటల నుంచి ఉద్యాన పంటల వైపు పంటల వైవిధ్యీకరణ చేపట్టడం ద్వారా సాగు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని, ఆదాయ వనరులను విస్తరించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా ఉద్యాన పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఉల్లిపాయ, వాము పంటల సాగుతో పాటు మల్చింగ్‌కు సంబంధించిన సబ్సిడీ అవకాశాలను అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తమకు సంబంధించిన డివిజన్ ఉద్యాన అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

## డివిజన్ వారీగా ఉద్యాన అధికారుల వివరాలు

..............................................................

**1. తాండూరు: యు. కమల -- 8977714195**
**2. కొడంగల్: ఆర్. సురేంద్రనాథ్ -- 8977714210**
**3. పరిగి: ఎం. సంతోష్ -- 8977714209**
**4. వికారాబాద్: ఎం. యమున -- 8977714212**
**5. మోమిన్‌పేట్: కె. అక్షిత -- 8977714211 అధికారుల సంప్రదించాలని కోరారు. ఉల్లిపాయ, వాము పంటల సాగు మల్చింగ్‌కు సబ్సిడీ పొందేందుకు ఆసక్తి గల అర్హులైన రైతులు నవంబర్ 10తేదీలోపు సంబంధిత డివిజన్ ఉద్యాన అధికారులను సంప్రదించి తమ దరఖాస్తులను సమర్పించాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి సత్తార్ కోరారు.**

## బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడిగా పారంద సాయి



**హయత్ నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడిగా హయత్ నగర్ కు చెందిన పారంద సాయి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు సాయిరాం గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పారంద సాయి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యువతను బీజేపీ వైపు ఆకర్షించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యువజన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. లెక్చరర్స్ కాలనీ డివిజన్-47కు చెందిన పారంద సాయి నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శంషాబాద్,అక్టోబర్23(జనంసాక్షి): పెద్ద షాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మదనపల్లి గ్రామం సమీపంలో జాతీయ రహదారి 44పై గుర్తుతెలియని వాహనం ఢీకొని 35 నుంచి 45 ఏళ్ల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఇన్స్పెక్టర్ సురేందర్ రెడ్డి ప్రకారం శుక్రవారం ఉదయం షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వైపు కాలినడకన వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర గాయాలై అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నల్లని షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, కుడిచేతిపై 'అమ్మానాన్న' అనే పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు, ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పెద్దషాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఆటోనగర్‌లో చెత్తను వెంటనే తొలగించాలి



## రాంకీ సంస్థకు మధుయాష్కి గౌడ్ హెచ్చరిక....

### నెల రోజుల్లో ఎస్టీపీ పునరుద్ధరించాలని అధికారులకు సూచన

**హయత్ నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో రాంకీ సంస్థపై కఠిన చర్యలు తీసుకునేలా చేస్తామని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్‌పర్సన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్ యార్డ్ వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు 18 కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధుల ఆహ్వానం మేరకు ఆయన శుక్రవారం డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. పేరుకుపోయిన చెత్త కుప్పలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.

ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సమస్యలను మధుయాష్కి గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా నిర్మాణ వ్యర్థాలు, చెత్తను అక్రమంగా ఆటోనగర్‌కు తరలిస్తున్నారని తెలిపారు. రహదారుల వెంట నిర్మాణ వ్యర్థాలు, వైద్య వ్యర్థాలను పారబోస్తున్నారని, నిర్ణీత పరిమితికి మించి చెత్తను తీసుకొస్తుండటంతో తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతం నుంచి వెలువడే వ్యర్థాలను సమీప అటవీ ప్రాంతంలో నిల్వ చేయడంతో పర్యావరణం దెబ్బతింటోందని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. వరద నీటి కాలువలోకి కూడా వ్యర్థాలను అక్రమంగా విడుదల చేస్తున్నారని ఆరోపించారు. రాంకీ సంస్థ చెత్తను రోజువారీగా తరలించాల్సి ఉండగా, ఆటోనగర్‌లోనే నిల్వ చేస్తోందని కాలనీవాసులు విమర్శించారు. జంతు కళేబరాలను కూడా ఇక్కడికి తీసుకొస్తుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని తెలిపారు.

### చెత్తను బహిరంగంగా నిల్వ చేయొద్దు

కాలనీవాసుల సమస్యలపై స్పందించిన మధుయాష్కి గౌడ్.. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతానికి సంబంధించిన మున్సిపల్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి, రాంకీ సంస్థ, అటవీ శాఖ, పోలీసు అధికారులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు.

ఆటోనగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను రాంకీ సంస్థ వెంటనే తొలగించాలని, చెత్తను బహిరంగంగా నిల్వ చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. చెత్తను మూసివేసిన షెడ్లలో నిల్వ చేసి వెంటనే తరలించాలని సూచించారు. ముందుగా నిర్ణయించిన విధంగా హయత్‌నగర్, నాగోల్ సర్కిళ్ల నుంచి మాత్రమే చెత్తను తీసుకువచ్చి, అదే రోజు తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ వ్యర్థాలను తరలించే వాహనాలను సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అక్రమంగా వ్యర్థాలను డంపింగ్ చేసే వాహనాలను గుర్తించి అధికారులకు అప్పగించాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు.

### నెల రోజుల్లో ఎస్టీపీ పునరుద్ధరణకు ఆదేశం

ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతం నుంచి వెలువడే వ్యర్థాల సమస్యకు పరిష్కారంగా మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ)ను నెల రోజుల్లోగా పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ఐలా కమిషనర్ నాగరాజుకు సూచించారు. జంతు కళేబరాల నిర్వహణ కోసం ఫతుల్లాగూడ తరహాలో ప్రత్యేక క్రిమిటోరియం ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు పంపాలని, నిధుల మంజూరుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. అప్పటివరకు జంతు కళేబరాలను నిబంధనల ప్రకారం భూమిలో పాతిపెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

డంపింగ్ యార్డ్ పరిసరాల్లో సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను పటిష్ఠం చేయాలని అధికారులకు చెప్పారు. అక్రమ డంపింగ్‌తో అటవీ ప్రాంతం దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆటోనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలోని వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ కేంద్రాన్ని పూర్తిగా తొలగించే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మధుయాష్కి గౌడ్ తెలిపారు. అక్రమంగా చెత్తను నిల్వ చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించకపోతే రాంకీ సంస్థపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అక్రమ డంపింగ్‌కు సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు తనకు పంపాలని కాలనీవాసులను కోరారు.

### పలువురు అధికారులు, నాయకులు హాజరు

ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేషన్ జంతు సంరక్షణ అధికారి డాక్టర్ రంజిత్, ఐలా కమిషనర్ నాగరాజు, ఎఫ్ఆర్ఓ సాయి ప్రకాశ్, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి వెంకట నర్సు, డీఈ సందీప్, రాంకీ సంస్థ ప్రతినిధి, యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పృథ్వీ చౌదరి, కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి బాలకృష్ణ యాదవ్, డీసీసీ కార్యదర్శి కొప్పుల వెంకట రెడ్డి, భీమిడి రామకృష్ణ రెడ్డి, వేములయ్య గౌడ్, కన్నా మహేష్, పోచబోయిన సురేష్ యాదవ్, ప్రమీల, మమత, కాలనీల జేఏసీ చైర్మన్ కత్తుల రాంబాబు, కార్యదర్శి కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ నాయకులకు నియామక పత్రాలను అందజేసిన మధుయాష్కి గౌడ్



హయత్‌నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ రంగారెడ్డి జిల్లా కమిటీ, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నూతన బాధ్యులకు ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ నియామక పత్రాలను అందజేశారు. హయత్‌నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎస్సీ డిపార్ట్‌మెంట్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ హోదాలకు నియమితులైన నాయకులకు మధుయాష్కి గౌడ్ నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ డిపార్ట్‌మెంట్ నియోజకవర్గ చైర్మన్‌గా ఉరిపక్క రవికుమార్, జిల్లా వైస్ చైర్మన్‌గా పోగుల నరసింహ, ప్రధాన కార్యదర్శులుగా నరేష్, పెద్దులు, మహాలక్ష్మి, నాగోల్ డివిజన్ అధ్యక్షుడిగా కాటేపాక బాలు, ఈఎస్ఐ పంగా గౌతం, మన్సూరాబాద్ ప్రశాంత్, లెక్చరర్స్ కాలనీ నాగరాజు, సాహెబ్‌నగర్ భవాని సరస్వతి, చింతలకుంట బాలకృష్ణ, హస్తినాపురం దర్గా శ్రీను, గడ్డిఅన్నారం అనసూయ శాంతి, చైతన్యపురి మేకల కృష్ణ, కొత్తపేట కుంభం మహేష్, లింగోజిగూడ కప్పరి శ్రీనివాస్ లను నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎస్సీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.

## నిరుద్యోగ యువత ఉపాధి పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

### మేడ్చల్ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి రాధిక సూచన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** నిరుద్యోగ యువత తెలంగాణ ఉపాధి పోర్టల్‌లో నమోదు చేసుకుని, తమ అర్హతలకు తగిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్-- మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎం.రాధిక సూచించారు. మేడ్చల్ జిల్లా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. పారిశ్రామిక, ఐటీ, లాజిస్టిక్స్, తయారీ రంగాలకు చెందిన పలు సంస్థలు తమ వద్ద ఖాళీల భర్తీకి జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదిస్తున్నాయని పేర్కొన్నారు.



నమోదు చేసుకున్నవారు ఉపాధి కార్డు పొందడంతో పాటు విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు. అభ్యర్థులు www.employment.telangana.gov.in వెబ్‌సైట్‌లోని Job Seekers Login విభాగం ద్వారా నమోదు చేసుకోవాలి. ఎస్ఎస్‌సీ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, మేడ్చల్ జిల్లాకు సంబంధించిన చిరునామా ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోను అప్‌లోడ్ చేయాలి. నిరుద్యోగ యువత ఆలస్యం చేయకుండా పోర్టల్‌లో నమోదు చేసుకుని ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలని రాధిక కోరారు.

### ఈనెల 26న ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను

# అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు జయప్రదం చేయాలి

**కే ఉన్నికృష్ణ**



కాప్రా, అక్టోబర్ 23 (జనం సాక్షి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న ఛలో హైదరాబాద్ మహాధర్నా"ను జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ ఒ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శుక్రవారం అల్వాల్ సిడిపిఓ కు సైనికురి షాపింగ్ కాంప్లెక్స్ ధర్నా నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా కే మునికృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను దెబ్బతీసే విధంగా ఉన్నాయని యూనియన్ నాయకులు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, కార్మికుల వేతనాలను అందుకు అనుగుణంగా పెంచడం లేదని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక సంఘాలతో చర్చలు జరిపి కార్మిక సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఐ ఎల్ సి సమావేశాలను నిర్వహించకపోవడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని యూనియన్ ఆరోపించింది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ఎన్నో సంవత్సరాలుగా తక్కువ పారితోషికంతో అధిక పనిభారాన్ని మోస్తున్నారని, అయినప్పటికీ వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సదుపాయాలు కల్పించడం లేదని పేర్కొంది.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య, గర్భిణులు, బాలింతలకు సేవలు అందిస్తూ ప్రజారోగ్యం, మహిళా శిశు సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేసింది. అంగన్వాడీ ఉద్యోగులను కార్మికులుగా గుర్తించి, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని స్పష్టం చేసింది.

**ప్రధాన డిమాండ్లు**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలి.

అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి.

. ప్రీ-ప్రైమరీ, పీఎం శ్రీ పథకాలను రద్దు చేసి, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలి.

. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి.

. రెండవ పీఆర్సీలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు కనీసం రూ.30,000 వేతనం నిర్ణయించాలి.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన రెండు డీఏలను అంగన్వాడీ ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలి.

. అంగన్వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ వంటి సామాజిక భద్రతా సదుపాయాలు కల్పించాలి.

# క్లోరోఫామ్ లీకేజీతో ఇద్దరి మృతి..

## సరాకా లేబొరేటరీస్‌పై టీజీపీసీబీ కొరడా




**పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు..**

**విద్యుత్ సరఫరా నిలిపివేయాలని టీజీఎస్‌పీడీసీఎల్‌కు సూచన**

**అమీర్‌పేట్ / సనత్ నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలోని సరాకా లేబొరేటరీస్ లిమిటెడ్ పరిశ్రమలో క్లోరోఫామ్ లీకేజీ కారణంగా ఇద్దరు మృతి చెందిన ఘటనపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) చర్యలు చేపట్టింది. శుక్రవారం పరిశ్రమను తనిఖీ చేసిన అధికారులు ప్రమాదానికి సంబంధించిన వివరాలను పరిశ్రమ జనరల్ మేనేజర్ మధు, డిప్యూటీ జనరల్ మేనేజర్ యోగేశ్వర్ రావును అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 22వ తేదీ రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో క్లోరోఫామ్ లీకేజీ జరిగింది. దాని ఆవిరికి గురైన ఇద్దరు వ్యక్తులు అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారిని నారాయణ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-2 మొదటి అంతస్తులో ఉన్న రియాక్టర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోని రిసీవర్‌కు క్లోరోఫామ్‌ను బదిలీ చేసే సమయంలో, లేయర్ సెపరేషన్ ప్రక్రియలో ఈ లీకేజీ జరిగినట్లు అధికారులు గుర్తించారు. లీకైన రసాయనం ఆ ప్రాంతమంతటా వ్యాపించినట్లు పరిశ్రమ ప్రతినిధులు వివరించారు.

ప్రమాద తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న టీజీపీసీబీ అధికారులు అక్టోబర్ 23న సరాకా లేబొరేటరీస్ లిమిటెడ్ పరిశ్రమకు ముందస్తు విచారణ అవకాశం కల్పించకుండానే మూసివేత ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్‌పీడీసీఎల్) సంగారెడ్డి పరిధి అధికారులను ఆదేశించారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ప్రవీణ్ రెడ్డి

**హయత్ నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా నియమితులైన ప్రవీణ్ రెడ్డి పార్టీ అధిష్ఠానానికి, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు పారిజాత రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలకు వాస్తవాల ఆధారంగా సమాధానమిస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం పనిచేస్తానని వెల్లడించారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజాసేవలో ముందుకు సాగుతానని ప్రవీణ్ రెడ్డి స్పష్టం చేశారు.



# బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**ఆర్బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్**

**మహేశ్వరం, అక్టోబర్23 (జనం సాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్, ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నీలేష్ ద్వివేది అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం డబిల్ గూడ గ్రామంలో ఆర్థిక సమ్మిళిత పథకాల సంతృప్తి కరణ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్బీఐ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకులు చిన్మయ్ కుమార్ మాట్లాడుతూ... ఖాతాదారులు కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. తమ ఖాతాలో నామినేషన్ వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన మార్పులను తీసుకోవాలన్నారు. ప్రచార లక్ష్యాలను గ్రామ పంచాయతీలలో, పట్టణాలలో నిర్వహించే శిబిరాల ద్వారా బ్యాంకింగ్ సేవల గురించి గ్రామస్థులకు వివరించారు. సుమారు 500 మంది గ్రామస్థులు పాల్గొన్నారు. సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్, ఆర్బిఐ జనరల్ మేనేజర్ జ్ఞాన సుప్రభాత్, డిఆర్డిఓ శ్రీలత, హైదరాబాద్ నాబార్డ్ డీజీఎం ఎంవిఎస్ఎస్ శ్రీనివాస్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సిజిఎం గోపాల్, డబిల్ గూడ గ్రామ సర్పంచ్ యాదమ్మ, ఉప సర్పంచ్ అర్చన, పలు బ్యాంకుల అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారు పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

**మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి**



మొయినాబాద్, అక్టోబర్23, జనంసాక్షి: రాష్ట్రంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అర్హులైన వారందరూ నవంబర్ 6వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డిగ్రీ పట్టాలు పొందిన ప్రతి ఒక్కరు సంబంధిత పత్రాలతో ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న పట్టభద్రులు తిరిగి మళ్లీ నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు అర్హులుగా పట్టభద్రులు పొందిన వారందరూ తమ ఓటు నమోదు చేసుకోని రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సరైన అభ్యర్థులను ఎన్నుకునేందుకు వట్టభద్రులు కృషి చేయాలని అన్నారు.

# ఎస్ఐ సురేష్‌కు ఘనంగా సన్మానం

ధారూర్, అక్టోబర్ 23(జనంసాక్షి): ధారూర్ మండలం ఎస్ఐ సురేష్‌ను రుద్రారం గ్రామ ఉప సర్పంచ్ కంది ప్రవీణ్ కుమార్ శుక్రవారం నాడు పోలీస్ స్టేషన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు కంది వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడు కంది భీమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపునకు ప్రత్యేక కార్యక్రమం

- హైదరాబాద్ డీఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్
- నవంబర్ 5 వరకు ఇంటింటి సర్వే..

**హైదరాబాద్, అక్టోబర్ 23 (జనంసాక్షి):** కుష్ఠు వ్యాధి కేసులను ముందస్తుగా గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందించేందుకు చేపట్టిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ)ను హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.పుట్ల శ్రీనివాస్ శుక్రవారం గాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు. ఈ నెల 23 నుంచి నవంబర్ 5 వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తిస్తారని పేర్కొన్నారు.





### ప్రారంభ దశలో గుర్తిస్తే వైకల్యాల నివారణ

కుష్ఠు వ్యాధిని తొలిదశలో గుర్తించి చికిత్స అందిస్తే శాశ్వత వైకల్యాలను నివారించవచ్చని డా.పుట్ల శ్రీనివాస్ తెలిపారు. వ్యాధిపై అపోహలు, వివక్షకు తావివ్వకుండా అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. కుష్ఠు వ్యాధికి అవసరమైన బహుళ ఔషధ చికిత్స ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉందని, వైద్యుల సూచనల మేరకు చికిత్సను పూర్తిచేసుకుంటే వ్యాధి నయమవుతుందని వివరించారు. అనుమానితులను గుర్తించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి పంపించి పరీక్షలు, చికిత్స అందేలా చూడాలని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచించారు.

### బోయగూడా పీహెచ్‌సీ సందర్శన

అనంతరం బోయగూడా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డా.పుట్ల శ్రీనివాస్ సందర్శించారు. కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపునకు ఇంటింటి సర్వే సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధన, పురోగతిపై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.మురళీధర్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డా.ఝాన్సీరాణి, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, గాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.ప్రశాంతి, సీతాఫల్‌మండి క్లస్టర్ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శని త్రయోదశి పురస్కరించుకుని శనీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

**అన్ని ఏర్పాట్లు చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ ఏవో నరేందర్**

**మోమిన్ పేట అక్టోబర్ 23 (జనం సాక్షి):** మోమిన్ పేట మండలంలోని శంకర్ భారతి మహారాజ్ ఆశ్రమంలో ప్రతిష్ఠించిన శనీశ్వర ఆలయం శనివారం శని త్రయోదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఏవో నరేందర్ తెలిపాడు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం పూజా సామాగ్రి నల్లని నువ్వుల నూనె నల్లని గుడ్డలు ఆలయ ప్రాంగణంలో లభిస్తాయని ఆయన చనిపోయాడు, దుర ప్రాంతాల భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం పూర్తిగ వైద్య ఆరోగ్య శిబిరం త్రాగునీటి వసతి వంటి సేవా కార్యక్రమాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి నరేందర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు దూర ప్రాంతాల భక్తుల కోసం, ప్రత్యేక



ఆర్టీసీ బస్సులు శంకర్పల్లి మోమిన్ పేట సంగారెడ్డి నుండి ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపాడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మోమిన్ పేట సిఐ వెంకటేశం ఆధ్వర్యంలో భారీ బందోబస్తులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు

# రాంపూర్ లో ఘనంగా నాగమ్మ కళ్యాణ మహోత్సవం

- కాంగ్రెస్ నేతల ప్రత్యేక పూజలు..
- నాగమ్మ కళ్యాణానికి రూ.15 వేలు విరాళం అందించిన హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ మొక్తాల నర్సింహులు గౌడ్

తలకొండపల్లి అక్టోబర్ 23(జనంసాక్షి): రాంపూర్ గ్రామంలో గురువారం నాగమ్మ కళ్యాణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో,ఘనంగా జరిగింది.గ్రామానికి చెందిన కటిక జోగిలాల్,కటిక మసీలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళ్యాణానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,హనుమాన్ దేవాలయ మాజీ చైర్మన్ మొక్తాల నర్సింహులు గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నాగమ్మ కళ్యాణానికి అక్షరాల రూ. 15,వేలను విరాళంగా అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హిందూ



సంప్రదాయంలో నాగ దేవతను సంతానాన్ని, సౌభాగ్యాన్ని,ఐశ్వర్యాన్ని ప్రసాదించే దేవతగా భావించి కొలుస్తారని,నాగదోషం ఉన్నవారు నాగమ్మ కళ్యాణం చేయించడం వల్ల దోషాలు తొలగి,సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకంగా కొలుస్తారని అన్నారు.గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని,ప్రజలు ఆరోగ్యంగా,సుఖ సంతోషాలతో ఉండాలని నాగమ్మను కోరుకున్నట్లు తెలిపారు.ఏటా నిర్వహించే ఈ కళ్యాణం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి,6వ వార్డు సభ్యులు తిక్కల జంగయ్య,యువ నాయకులు కాకి శివ,రొయ్యల జగదీష్,సిద్ధు,తదితర గ్రామ నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో జుర్కి రమేష్ పటేల్ జన్మదినం

శంషాబాద్, అక్టోబర్23 (జనంసాక్షి): పిల్లోనిగూడ గ్రామ అధ్యక్షుడు జుర్కి రమేష్ పటేల్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ నివాసంలో ఎమ్మెల్యేతో కలిసి కేక్ కట్ చేసి తినిపించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సి. మహేందర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ శ్రీశైలం, కె. నరసింహ, పి. నరసింహ, రామ్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ శాఖ విధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

మొయినాబాద్,అక్టోబర్23, జనంసాక్షి: అమరవీరుల దినోత్సవం లో భాగంగా మొయినాబాద్ పోలీస్ స్టేషన్ సీఐ వై.మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు పోలీస్ శాఖ విధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఆసక్తిగా పోలీస్ శాఖ విధుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు మహిళలు, బాలల భద్రతకు సంబంధించిన అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





# రాళ్లగూడ డ్రైనేజీ సమస్యకు వారంలో పరిష్కారం

**శంషాబాద్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** కొత్వాల్‌గూడ 119వ డివిజన్‌లోని రాళ్లగూడ రోడ్డు దుస్థితి, రోడ్డు పక్కన డ్రైనేజీ పొంగిపొర్లుతున్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేందుకు పనులు ప్రారంభిస్తామని హెచ్‌జీసీఎల్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమస్యలపై కొత్వాల్‌గూడ బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొనముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం హెచ్‌జీసీఎల్, హెచ్ఎండీఏ అధికారులకు వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే, అందుకు స్పందించిన అధికారులు శుక్రవారం ఉదయం రాళ్లగూడలోని సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శికి రోడ్డు ప్రమాదం-తలకు తీవ్ర గాయాలు



**తలకొండపల్లి, అక్టోబర్ 23 (జనంసాక్షి):** ఆమనగల్ నుంచి తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామానికి బైక్ పై వెళ్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి వాజీద్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.ఖానాపూర్ సమీపంలోని పలుగుగుట్ట వద్ద ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో బైక్ ను ఢీకొట్టడంతో వాజీద్ కు తల,కాలుకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే 108 అంబులెన్స్ లో ఆమనగల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.వేల్జాల్ గ్రామ కార్యదర్శి వాజీద్ ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న తోటి ఉద్యోగులు,పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కార్యదర్శులంతా న్యాయం కోసం మూకుమ్మడిగా పోలీస్ స్టేషన్ కు వెళ్తున్నట్లు తెలిపారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలపై అవగాహన ర్యాలీ

### సెరినిటి స్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన కీసర పోలీసులు

కీసర, అక్టోబర్ 23 (జనంసాక్షి): దేశ రక్షణ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కీసర సీఐ ఎలక్షన్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాగారంలో సెరినిటీ స్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. విద్యార్థులు 'పోలీసు అమరవీరులకు జోహార్' అంటూ నినాదాలు చేశారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని, విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో మెలగాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమం లో సెక్టార్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాఠశాల కరెస్పాండంట్ నోముల జంగిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

### ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి సీఐటీయూ డిమాండ్

**హయత్ నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** దేశవ్యాప్తంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అఖిల భారత కమిటీల పిలుపులో భాగంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించి, ఎన్నికల ప్రధాన అధికారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కోశాధికారి కవిత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 కోట్ల 37 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లాలో కూడా ఓట్ల తొలగింపు జరిగిందని పేర్కొంటూ,



తొలగించిన ఓట్లన్నింటినీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద ప్రజల ఓట్లను తొలగిస్తోందని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు. తొలగించిన ఓట్లను గతంలో ఉన్న విధానంలోనే పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు విమర్శించారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో రాజీనామా చేసే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక వీరయ్య, హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, మత్స్య కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తడబోయిన కృష్ణమూర్తి, ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షుడు సీహెచ్ మున్నా, కార్యదర్శి లాట్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గంగరాజు, సహాయ కార్యదర్శి లింగయ్య, కోశాధికారి ఆంధ్ర శీను, పి. జోసెఫ్, భాస్కర్, ఈ. ఎల్లయ్య, వెంకన్న, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు. అడ్డా కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# ఆత్మరక్షణే.. ఆయుధం

### దిర్సంపల్లిలో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో "రాణి లక్ష్మీబాయి కరాటే శిక్షణ"

**దోమ, అక్టోబర్ 23 (జనంసాక్షి):** బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నేపథ్యంలో బాలికల ఆత్మరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ" కార్యక్రమంలో బాగంగా వికారాబాద్ జిల్లా దోమ మండలం దిర్సంపల్లి పిఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో టైక్వాండో కరాటే శిక్షణ తరగతులు జరుగుతున్నాయి.6 నుండి 10వ తరగతి వరకు చదివే బాలికలకు మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇస్తున్నారు. సుశిక్షితులైన మాస్టర్లను ఎంపిక చేసి ఒక్కొక్కరికి మూడు నుండి నాలుగు పాఠశాలల బాధ్యత అప్పగించి రోజూ ఉదయం అయినా సాయంత్రం అయినా ఒక పిరియడ్ ని ఉపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పిస్తున్నాము అని మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు. దిర్సంపల్లి పాఠశాలకు కరాటే మాస్టర్ శేఖర్ ని నియమించారు.

చాలా మంది విద్యార్థినులు కాలినడకన పాఠశాలకు వస్తున్నందున దారిలో ఎలాంటి సంఘటన ఎదురైనా వాటిని అధిగమించి తమ ప్రాణాలను రక్షించుకునేలా మెళకువలు నేర్పిస్తున్నారు. పంచ్, కిక్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ఉపాధ్యాయుల,ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పిస్తున్నామని మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ దిర్సంపల్లి ప్రధానోపాధ్యాయులు రూప్ సింగ్ పాల్గొన్నారు.

**మనోధైర్యం వస్తుంది.. కరాటే మాస్టర్ శేఖర్**

ఈ సందర్భంగా కరాటే మాస్టర్ శేఖర్ మాట్లాడుతూ "రాణి లక్ష్మీబాయి పేరుతో ప్రభుత్వం ఇస్తున్న ఈ మూడు నెలల శిక్షణ వల్ల బాలికల్లో మనోధైర్యం వస్తుంది.తమ ఎదుట ఎలాంటి సంఘటన జరిగినా ఎదుర్కొనేలా మెళకువలు నేర్పిస్తున్నాం. ప్రతి పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థినులు పాలుపంచుకుంటున్నారు. దిర్సంపల్లి బాలికలను మండల స్థాయి పోటీల్లో గెలిచేలా తీర్చిదిద్దుతాను. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని అన్నారు.

తల్లిదండ్రులు స్పందిస్తూ "ప్రభుత్వం ఇలా ఉచితంగా కరాటే నేర్పించడం వల్ల మా పిల్లల రక్షణపై మాకు ధైర్యం వచ్చింది. సర్కార్ బడిపై నమ్మకం మరింత పెరిగింది" అని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కరాటే శిక్షణతో ఎంతో మేలు..మండల విద్యాధికారి వెంకట్**

సుశిక్షితులైనా మాస్టర్లతో మండల వ్యాప్తంగా ఉన్న ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీలో (కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం) బాలికలకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నాం. ప్రతిరోజు శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థినిలు ఎంతో మనోధైర్యంతో ముందుకు సాగుతున్నారు. నాణ్యమైన విద్యతోపాటు కరాటే శిక్షణ అందిస్తున్నందున తల్లిదండ్రుల్లో ఎంతో ధైర్యం పెరుగుతున్నది. ప్రభుత్వ ఆదేశాలతో మండలంలోని ప్రతి ఉన్నత పాఠశాలలో ఒక తరగతిని కరాటేకు కేటాయించాం. అని మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు.

